

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కుమ్మరి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడికుడ జయంతరావు, మల్కాజిగిరి దయానంద్ తదితరులు

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కుమ్మరి సంఘం వినతి

చంపాపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అంతరించి పోతున్న కులవృత్తిని కాపాడాలని కోరుతూ పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కుమ్మరి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడికుడ జయంతరావు, ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి దయానంద్ వినతిపత్రం అందజేశారు. కులవృత్తులను కాపాడటానికి ప్రభుత్వ పరంగా కృషి చేయనున్నట్లు మంత్రి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి సంఘం రాష్ట్ర కోశాధికారి ఆమంచి రాజలింగం, అసోషియేట్ అధ్యక్షుడు టికే శ్రీనివాస్, చత్రపతి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మలక్‌పేట పీఎస్‌ను సందర్శించిన డీసీపీ జానకి



డీసీపీ జానకీ ధరావత్‌కు స్వాగతం పలుకుతున్న మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ జయరాం

చాదర్‌ఘాట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీగా బాధ్యతలు చేపట్టిన జానకి ధరావత్ సోమవారం మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. మలక్‌పేట పీఎస్‌కు రాగానే అదనపు ఇన్‌స్పెక్టర్ జయరాం డీసీపీకి ఘన స్వాగతం పలికారు. అనంతరం డీసీపీ మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐలు జయంత్, సురేష్, నవీన్, అడ్మిన్ ఎస్ఐ శృతి పనిచేస్తున్న క్యాబిన్‌కు వచ్చి వారి పనితీరును, రిసెప్షన్‌లో వచ్చే ఫిర్యాదులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మొదటి అంతస్తులో ఉన్న క్రైం విభాగానికి వెళ్లి క్రైం రికవరీపై అడిగి తెలుసుకున్నారు.

దీపాదాస్ మున్షీని కలిసిన చిగిరింత



ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీపాదాస్ మున్షీని సోమవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా నియమితులైనందుకు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రానున్న పార్లమెంటు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై వారు చర్చించుకున్నారు. - సరూర్‌నగర్, ఆంధ్రజ్యోతి.

డ్రైనేజీ పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన

మన్సూరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ అరుణోదయ నగర్ కాలనీలో నూతనంగా చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్‌యాదవ్ సోమవారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. పనులను వేగంగా పూర్తి చేయాలని, నాణ్యత పాటించాలని కార్పొరేటర్ సూచించారు.

ఓటరు నమోదు కేంద్రాన్ని వినియోగించుకోవాలి

కొత్తపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ సూచించారు. సోమవారం వాస్విక్ ఫౌండేషన్ అధ్వర్యంలో మోహన్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఓటరు కార్డు లేని వారు, ఓటరు కార్డులో చిరునామా, పేర్లు, ఇతర వివరాల్లో తప్పులను సరిచేసుకునే వారు ఈ కేంద్రంలో సంప్రదించాలని పవన్‌కుమార్ అన్నారు. డివిజన్‌లో ఇతర కాలనీల్లోనూ ఓటరు నమోదు చేసుకునే వారు పెద్దసంఖ్యలో ఉంటే ఆయా కాలనీల సంక్షేమసంఘాల వారు 9849239775 నెంబర్‌కు సంప్రదించవచ్చని నిర్వాహకుడు ఠాకూర్ ఉపేందర్ సింగ్ తెలిపారు.

ప్రార్థనా మందిరం వద్ద వైన్స్ ఏర్పాటు వద్దు

సైదాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): గడ్డిఅన్నారంలోని శివగంగా థియేటర్ వద్ద షియా కమ్యూనిటీ ప్రార్థన మందిరం (అసూర్‌ఖానా) సమీపంలో వైన్స్, ఓపెన్ బార్ ఏర్పాటు చేయవద్దంటూ అసూర్‌ఖానా అలీ అస్గర్ మేనేజింగ్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ బాకర్ హుస్సేన్ డిమాండ్ చేశారు ఈ విషయమై తెలంగాణ ముఖ్యమంత్రి, రంగారెడ్డి కలెక్టర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, గ్రేటర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు వివరించారు.



వీరన్నగుట్ట పరిసర కాలనీలలో ఇంటింటికీ శ్రీరాముల వారి అక్షింతలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ నరసింహారెడ్డి, తదితరులు

డెంగీ, మలేరియాపై అవగాహన కల్పించండి

ఎల్బీనగర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రజలకు డెంగీ, మలేరియా, క్షయలపై అవగాహన కల్పించాలని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు ఆదేశించారు. సోమవారం సరూర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో కేంద్ర నిర్వాహణపై సమీక్షించారు. ప్రజలకు వైద్యసేవలందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సహించేదిలేదన్నారు. ముఖ్యంగా డెంగీ, మలేరియా, క్షయ వ్యాధుల నిర్మూలనకు తగు చర్యలు చేపట్టాలన్నారు. అనుమానిత కేసులను గుర్తించి తగిన చికిత్సలు సకాలంలో అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ గీత, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ, సీహెచ్‌ఓ జ్ఞానేశ్వర్, రఘు, అంజనేయులు, భాను తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ వాసులకు చీరలు, దుప్పట్ల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్, సంతోష్‌నగర్ కాలనీలోని 172 లెప్రసీ బాధిత కుటుంబాలకు చీరలు, షర్ట్‌లు, దుప్పట్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి 4వ వార్డు కౌన్సిలర్ వడ్డెపల్లి విద్యావతి విజయేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వారికి చీరలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎల్‌పీపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. రమేష్, కాలనీ అధ్యక్షుడు యం సామ్యేల్, రహిమతుల్లా, సీహెచ్ పుల్లయ్య, సంతోష్‌నగర్ కాలనీ అధ్యక్షుడు జే. పుల్లయ్య, పెంటయ్య, కాలనీ వాసులు పాల్గొన్నారు.

అఖిల భారత యాదవ మహాసభ యూత్ ఉపాధ్యక్షుడిగా కిరణ్‌కుమార్

మన్సూరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత యాదవ మహాసభ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నాగోల్‌కు చెందిన చింతల కిరణ్‌కుమార్‌యాదవ్ నియమితులయ్యారు. రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు అయిలబోయిన రమేష్‌యాదవ్ నియామక ఉత్తర్వులు జారీ చేసి.. మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బాబూరావుయాదవ్, వర్కింగ్‌ప్రెసిడెంట్ రవీందర్‌యాదవ్‌లతో కలిసి సదరు నియామక పత్రాన్ని కిరణ్‌కుమార్‌కు అందజేశారు.

ప్రజాసమస్యలు చెప్పుకునేందుకే ప్రజావాణి

- ప్రతి సోమవారం నిర్వహణ
- ప్రారంభించిన గంటలోనే 21 ఫిర్యాదులు..
- మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ

ఎల్బీనగర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చెప్పుకునేందుకే ప్రజావాణి కార్యక్రమమని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ చెప్పారు. కోవిడ్ అనంతరం చాలా కాలం తర్వాత సోమవారం నుంచి జీహెచ్ఎంసీలో ప్రజావాణి కార్యక్రమాన్ని మళ్లీ ప్రారంభించారు. జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని మేయర్ విజయలక్ష్మీ ప్రారంభించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజాసమస్యలు తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించేందుకే ఉపయోగపడుతుందన్నారు. ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 22 నుంచి ప్రధాన కార్యాలయంలో కూడా చేపడతామన్నారు. ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, వినతులను విచారించి, పరిష్కరించి శనివారం వరకు నివేదిక అందజేయాలని అధికారులను మేయర్ ఆదేశించారు. ప్రజావాణి ప్రారంభించిన గంటలోనే 21 ఫిర్యాదులు వచ్చాయంటే ప్రజలకు సమస్యలున్నట్లు తెలుస్తుందన్నారు. అవికూడా చిన్నచిన్న సమస్యలున్నాయని వాటిని త్వరిత గతిన పరిష్కరిస్తామన్నారు. సోమవారం నాటి ప్రజావాణిలో ఎల్బీనగర్‌లో టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించిన సమస్యలు ఎక్కువగా వచ్చాయన్నారు. నిర్మాణాలకు సంబంధించిన ఫిర్యాదులను ప్రారంభ దశలోనే చేస్తే చర్యలు తీసుకునే అవకాశముంటుందన్నారు. నిర్మాణాలు పూర్తయిన తర్వాత చాలా మంది ఫిర్యాదు చేస్తున్నారని అప్పుడు కొన్ని సమస్యలు ఎదురయ్యే అవకాశమున్నదన్నారు. ఏది ఏమైనా అక్రమ నిర్మాణాలపై చర్యలుంటాయన్నారు. కుక్కలను పట్టుకుని స్టెరిలైజేషన్ ఎక్కడి నుంచి పట్టుకొచ్చారో వాటిని మళ్లీ అక్కడే వదిలిపెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ, ఎస్ఈ అశోక్‌రెడ్డి, సీపీ ప్రసాద్‌రావు, ఎంటమాలజిస్ట్ రజని, ఓఎస్‌డీ విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో సమస్యలను తెలుసుకుంటున్న జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

వనస్థలిపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్‌లోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కోరారు. సోమవారం జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి పలు సమస్యలను మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. బీఎన్‌రెడ్డినగర్‌లోని పలు కాలనీల్లో రోడ్లు, శివారు కాలనీలకు భూగర్భ డ్రైనేజీ, మంచినీరు, విద్యుత్ స్థంబాలు, వీధి దీపాల సమస్యలను పరిష్కరించి, డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

పెండింగ్ పనులను పునరుద్ధరించండి

కొత్తపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్‌లో పెండింగ్ పనులను పునరద్దరించే చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మికి విన్నవించారు. జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ గద్వాల విజయలక్ష్మికి డివిజన్‌లోని ఎస్ఆర్ఎల్ కాలనీలో ఆగిపోయిన బాక్స్ డ్రెయిన్ పనులు, సీసీ రోడ్డు పనులు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం తదితర అంశాలను పవన్ కుమార్ వివరించారు. మంజూరైన పనులతో పాటు ఆగిన పనులనూ తిరిగి చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఇంకా కాలనీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. పెండింగ్ పనులపై సమీక్ష నిర్వహించి, పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాని మేయర్ అధికారులకు సూచించినట్లు కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు.

పేదలకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ ఓ వరం

- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సబితా, ఎమ్మెల్సీ దయానంద్, కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్

ఎల్బీనగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబాలకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాలు ఓ వరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సరూర్‌నగర్, ఆర్‌కేపురం డివిజన్‌లకు చెందిన లబ్ధిదారులకు సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్, కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్‌లతో కలిసి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం వృద్ధాప్య, వితంతువు, వికలాంగుల పెన్షన్‌ను అందించడమే కాకుండా ఒంటరి మహిళ, బోదకాల వ్యాధి వారికి, డయాలసిస్ రోగులకు కూడా పెన్షన్లను అందజేసిందన్నారు. ఆడబిడ్డల ఆత్మగౌరవం పెంచేలా మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ నల్లాల ద్వారా నీటిని అందించమన్నారు. లబ్ధిదారులకు చెక్కులు గతంలోనే మంజూరైనప్పటికీ ఎన్నికల నియమావళి కారణంగా ఇవ్వలేకపోయామన్నారు. ఇప్పుడు ఇచ్చిన చెక్కులను లబ్ధిదారులు వెంటనే బ్యాంకులో జమ చేసుకోవాలని ఆమె సూచించారు. ఇకపై లబ్ధిదారులు లక్ష రూపాయలతో పాటు తులం బంగారం అందుకుంటారని ఆశిస్తున్నామన్నారు. సరూర్‌నగర్, ఆర్‌కేపురం డివిజన్ల పరిధిలో వెయ్యి డబుల్ రూములు అందించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్త, యెగ్గె మల్లేషం, కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్, మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, లోకసాని కొండల్‌రెడ్డి, శ్యాంసుందర్‌గుప్త, కొంద్ర శ్రీనివాస్, కంచర్ల శేఖర్, సాజిద్, పెంబర్తి శ్రీనివాస్, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా

క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలి

వనస్థలిపురం, జనవరి 8 (ఆంధ్ర జ్యోతి): బీఎన్‌రెడ్డినగర్‌లోని సుధాకర్ రెడ్డి బ్యాడ్మింటన్ అకాడమిలో గత మూడు రోజులుగా నిర్వహించిన సుధాకర్ రెడ్డి మెమోరియల్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ ఛాంపియనిస్ట్ టోర్నమెంట్-2023 ఘనంగా ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జీఎస్టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ కమిషనర్ పద్మశ్రీ, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తాలు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటే క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకుని ఏకాగ్రతతో పోటీల్లో రాణించాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస రావు, బాబు, ప్రభాకర్‌రెడ్డి, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

10న ముగ్గుల పోటీలు

వనస్థలిపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రంగస్థల కళాకారుల అభిమాన సమాఖ్య వనస్థలిపురం ఆధ్వర్యంలో ఎన్జీవోస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫీస్ ముందు ఈనెల 10న మధ్యాహ్నం 2గంటలకు సంక్రాంతి ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు రంగస్థల కళాకారుల అభిమాన సమాఖ్య అధ్యక్షులు పంపన వెంకటేశ్వర రావు, కార్యదర్శి ఎం.పి.ఎన్ వర్ధినిలు తెలిపారు. ముగ్గుల పోటీల్లో పాల్గొనే మహిళలు తమ పేర్లు నమోదుకు ఫోన్ నం.8919416798ను సంప్రదించాలనీ ఆయన కోరారు.

బ్రెయిన్‌డెడ్ వ్యక్తి నుంచి అవయవాల సేకరణ



సైదులు(ఫైల్)

మన్సూరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్‌డెత్‌కు గురైన వ్యక్తి నుంచి కామినేని ఆసుపత్రి వైద్యులు అవయవాలను సేకరించారు. ఆసుపత్రి ప్రతినిధుల కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా పెద్దవూర మండలం పులిచర్ల గ్రామానికి చెందిన మావిళ్ల సైదులు (33) ఈ నెల 5న తన ఇంటి వద్ద అనుకోకుండా కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయాలు అవటంతో అతన్ని ఎల్బీనగర్‌లోని కామినేని ఆసుపత్రిలో చేర్పించారు. బ్రెయిన్‌డెత్‌కు గురైనట్లు ఆదివారం రాత్రి వైద్యులు ప్రకటించారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో సైదులు శరీరం నుంచి లివర్, కిడ్నీలు, కంటి శుక్లాలను సేకరించినట్లు ఆసుపత్రి ప్రతినిధులు తెలిపారు.

ప్రాణం తీసిన సెల్ఫీ సరదా

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సెల్ఫీ దిగుతుండగా రైలు ఢీకొని ఓ బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. బొల్లారం రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. దానాపూర్ షాహాపూర రాంపూర్ గ్రామానికి చెందిన ఉబేష్ (16) బొల్లారంలోని బాబాయి ఇంటికి వచ్చాడు. సమీపంలోని రైలు పట్టాల వద్ద మైదానంలో ఆడుకునేందుకు ఆదివారం వచ్చాడు. పట్టాల వద్దకు వెళ్లిన ఉబేష్ రైలు వస్తున్న క్రమంలో సెల్ఫీ తీసుకుంటుండగా, రైలు ఢీకొట్టింది. దీంతో ఉబేష్ అక్కడికక్కడే మరణించాడు. రైల్వేపోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మైనర్‌పై అత్యాచారం కేసులో నిందితుడికి జైలు

రంగారెడ్డి కోర్టులు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మైనర్‌పై లైంగిక వేధింపులకు పాల్పడిన నిందితునికి 5 సంవత్సరాల జైలు శిక్ష, రూ. 15,000 జరిమానాతో పాటు రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలని రంగారెడ్డి జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎమ్.కె.పద్మావతి తీర్పు చెప్పారు. స్పెషల్ పీపీ బర్ల సునిత కథనం ప్రకారం.. 2022లో బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సయ్యద్ వాసెహ్ ఓ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఫిర్యాదు అందింది. కేసు పరిశోధనలో పోలీసులు సాక్ష్యాధారాలు సేకరించి చార్జిషీటు దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించి విచారించిన పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎమ్.కె. పద్మావతి నిందితునికి 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 15 వేల జరిమాన విధించడమే కాకుండా బాధితురాలికి రూ. లక్ష నష్టపరిహారం చెల్లించాలని తీర్పు చెప్పారు.

వృద్ధురాలి గొలుసు చోరీ

మన్సూరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆటోలో కూర్చున్న వృద్ధురాలి మెడలో నుంచి బైకుపై వచ్చిన దుండగులు బంగారు గొలుసు లాక్కెళ్లారు. పోలీసుల కథనం ప్రకారం.. నాగోల్ జైపురి కాలనీలో జె.పద్మ నివాసం ఉంటున్నారు. తను నివాసం ఉంటున్న ఇంటికి సమీపంలోనే తన కుమారుడు కొత్తగా ఇల్లు నిర్మిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం అక్కడికి వెళ్లిన పద్మ.. ఆ ఇంటి ముందు నిలిపిన ఆటోలో కూర్చుంది. ఈ క్రమంలో బైకుపై వచ్చిన దండగులు ఆమె మెడలో నుంచి సుమారు ఆరు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్‌ను ఢీకొని యువకుడి మృతి..



కలిముల్లా(ఫైల్)

వనస్థలిపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అతివేగంతో రాంగ్ రూట్‌లో వచ్చి టిప్పర్‌ను ఢీకొని ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలైన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బిహార్ రాష్ట్రానికి చెందిన కలిముల్లా(20), అన్వర్ హుస్సేన్(30)లు ఇద్దరు స్నేహితులు. గత కొంతకాలంగా ఇరువురు హయత్‌నగర్ బొమ్మలగుడి సమీపంలోని అద్దె ఇంట్లో నివాసం ఉంటు మగ్గం పనిచేసుకుంటు జీవనం సాగిస్తున్నారు. కాగ కలిముల్లా, అన్వర్ హుస్సేన్‌లు ఇద్దరు సోమవారం సాయంత్రం హయత్‌నగర్ నుంచి తమ ద్విచక్ర వాహనం (ఏపి12ఎల్ 7499)పై ఎల్బీనగర్‌కు వెళ్తున్నారు. అందులో భాగంగా ఆటోనగర్ సమీపంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో వీరు రాంగ్‌రూట్‌లో అతివేగంగా ఎదురుగా వస్తున్న టిప్పర్(ఏపి26టి ఇ7284)ను బలంగా ఢీ కొట్టారు. దీంతో ఇరువురికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. ఈ క్రమంలో తీవ్ర గాయాలైన కలిముల్లా చికిత్స పొందుతు మృతి చెందాడు. అన్వర్ హుస్సేన్ చికిత్స పొందుతున్నాడు.ఈ మేరకు కేసు నమోదు చెసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రెవెన్యూ అధికారుల ద్వంద్వ వైఖరి

- భాగ్యనగర్ రైతు సొసైటీ డైరెక్టర్ కొండల్‌రెడ్డి ఆరోపణ



బాలాపూర్ రెవెన్యూ అధికారులు సోమవారం కూల్చివేయించిన పశువుల పాక ప్రహరీ

సరూర్‌నగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బాలాపూర్ మండలం అల్మాస్‌గూడలోని సర్వే నంబర్లు 85, 86లలో గల ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాల కూల్చివేతల విషయంలో రెవెన్యూ అధికారులు ద్వంద్వ వైఖరి అవలంభిస్తున్నారని, కొన్నింటిని కూల్చి మరి కొన్నింటిని వదిలేయడం అధికారుల పక్షపాత ధోరణికి నిదర్శనమని భాగ్యనగర్ రైతు సొసైటీ డైరెక్టర్ చప్పిడి కొండల్‌రెడ్డి ఆరోపించారు. ఆయా సర్వే నంబర్లలో ఓ పశువుల పాకకు చెందిన ప్రహరీని ముందస్తు సమాచారం లేకుండా సోమవారం అధికారులు కూల్చివేయించారు. అయితే అవే సర్వే నంబర్లలో వెలిసిన పలు శాశ్వత కట్టడాలనుగానీ, కొన్ని తాత్కాలిక కట్టడాలనుగానీ పట్టించుకోకుండా అలాగే వదిలేశారు. ఈ వ్యవహారంపై సోమవారం అల్మాస్‌గూడలో కొండల్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. ఆయా సర్వే నంబర్లలోని మొత్తం భూమిని సర్వే చేస్తేనే పట్టాభూమి, ప్రభుత్వ భూమి హద్దులు తెలుస్తాయని, అప్పుడు కబ్జాదారులు ఎవరో తేలుతుందని అన్నారు.

నాలాపై చేపడుతున్న ఇంటి నిర్మాణాన్ని పరిశీలించిన అధికారులు

మన్సూరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ సౌత్‌ఎండ్ పార్కు కాలనీలో వరద నీటి నాలాపై చేపడుతున్న ఇంటి నిర్మాణాన్ని హయత్‌నగర్ సర్కిల్ అధికారులు సోమవారం పరిశీలించారు. సదరు కాలనీలో ఉన్న నాలాపై పిల్లర్లు వేసి నిర్మాణాలు చేస్తున్నారని, వరదలు వచ్చినప్పుడు తమ ఇళ్లు మునిగిపోతాయని జీహెచ్ఎంసీ అధికారులకు ఇటీవల స్థానికులతో పాటు ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేశారు. దీంతో హయత్‌నగర్ సర్కిల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ పావని, టీపీఎస్ మన్సూర్, ఈఈ రమేష్‌బాబు సోమవారం సదరు నిర్మాణ పనులను పరిశీలించారు. సదరు ఇంటి నిర్మాణంపై ఫిర్యాదులు వస్తున్నందున తాత్కాలికంగా నిర్మాణ పనులు ఆపేయాలని సూచించినట్లు ఏసీపీ పావని తెలిపారు. నిర్మాణదారుల నుంచి అన్ని రకాల డాక్యుమెంట్లు అడిగామని ఆమె తెలిపారు. ఆయా పత్రాలను పరిశీలించటంతో పాటు అక్కడ చేపడుతున్న నిర్మాణానికి సంబంధించిన కొలతను కూడా పరిశీలించి తగిన చర్యలు చేపడుతామని ఆమె వివరించారు.

కమ్యూనిజం, క్యాపిటలిజాలతో సమగ్రాభివృద్ధి సాధ్యం కాదు

హైదరాబాద్ సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడం శుభపరిణామని దేశంలో టెలికాం విప్లవానికి ఆద్యుడైన సాం పిట్రోడా అభివర్ణించారు. ఆయన రాసిన 'రీడిజైన్ ది వరల్డ్' పుస్తకానికి పోలిదాసు నరసింహారావు తెలుగు అనువాదం 'ప్రపంచానికి కొత్త రూపం ఇద్దాం కదలిరండి' పుస్తకాన్ని సోమవారం నగరంలోని ఓ హోటల్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ ఆన్‌లైన్ వేదికగా సాం పిట్రోడా మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న అన్నీ ప్రజాస్వామ్య దేశాలలో నియంతృత్వం చోటుచేసుకొందని ఆయన వ్యాఖ్యానించారు. కమ్యూనిజం, క్యాపిటలిజం ... ఈ రెండు వ్యవస్థలూ ప్రపంచాన్ని సుఖంగా ఉంచలేవని, అవి మానవాళి సమగ్రాభివృద్ధికి తోడ్పడవని అభిప్రాయపడ్డారు. "కమ్యూనిజాన్ని వదిలి, ఇవాళ క్యాపిటలిజం నమూనాను ఎంపిక చేసుకున్నాం. అయితే, పెట్టుబడిదారీ వ్యవస్థలోనూ అంతకంతకూ అసమానతలు పెరగడాన్ని చూస్తున్నామని" సాం పిట్రోడా అన్నారు. ప్రజాస్వామ్యం పేరుతో పాలకులు సాగిస్తోన్న నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీలో చదువుతున్న సమయంలో తాను సాం పిట్రోడా ప్రభావానికి లోనైనట్లు తెలిపారు. "సాం పిట్రోడా 80ఏళ్ల వయసులోనూ ప్రపంచాన్ని మార్చడానికి, నూతన ఆవిష్కరణలు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఆ క్రమంలో రోజుకు 16గంటలు శ్రమిస్తున్నారు. ఆయన అంకితత్వం, సృజనాత్మకత, అత్యున్నత ప్రతిభ, దార్శనికత లాంటి వన్నీ నాకెంతో స్ఫూర్తినిచ్చాయి" అన్నారు.

కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, విశ్రాంత ఐపీఎస్ సాంబశివరావు, ఎమ్మెల్యే మదన్‌మోహన్, ఎమెస్కో ఎడిటర్ డి. చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిధానీ బస్ డిపోలో ఘనంగా వనభోజనాలు



మిధానీ డిపోలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ హైదరాబాద్ రీజినల్ మేనేజర్ వరప్రసాద్

చంపాపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కంచన్‌బాగ్‌లోని మిధాని ఆర్టీసీ బస్‌డిపోలో సోమవారం వనబోజనాల మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. డీఎం అంజనేయులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్టీసీ హైదరాబాద్ రీజినల్ మేనేజర్ వరప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. 'ఉచిత బస్' కార్యక్రమానికి మహిళల నుంచి మంచి స్పందన వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చార్మినార్, హయత్‌నగర్ డీఆర్ఎంలు విజయభాను, సుచరిత, డ్రైవర్లు, కండక్టర్లు, ఆయా విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'రివర్షన్ ఇంజనీర్లకు న్యాయం చేయాలి'

హైదరాబాద్‌సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ప్రొఫెసర్ కోదండరాంను రివర్షన్ చేయబడిన 167 మంది టీఎస్ జెన్‌కో, ట్రాన్స్‌కో ఇంజనీర్లు కోరారు. సోమవారం ఆయనకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఇంజనీర్లు డి.బాలాజీ, అంజయ్య, చంద్రప్రకాష్ మాట్లాడుతూ.. ఏడేళ్ల పాటు ఉన్నత స్థానంలో పనిచేసిన 167 మంది ఇంజనీర్లను కిందిస్థాయికి రివర్షన్ చేశరన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తానని కోదండరాం హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఇంజనీర్లు ప్రవీణ్, అంజన్‌రెడ్డి, శ్రీనివాస్, దాసు పాల్గొన్నారు.

మలక్‌పేట మార్కెట్‌కు పోటెత్తుతున్న ఉల్లి

ఓల్డ్‌మలక్‌పేట జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌కు ఉల్లిపంట పోటెత్తుతోంది. సోమవారం ఒక్కరోజే 18వేల క్వింటాళ్ల ఉల్లి మార్కెట్‌కు దిగుమతి అయ్యింది ఎక్కువగా మహారాష్ట్ర, కర్ణాటక నుంచి వస్తుంది. ఒక క్వింటా ఉల్లి ధర గరిష్టంగా 2400, కనిష్ట ధర 600గా అమ్ముడుపోయింది.

ఇక మెదక్, కర్నూలు, మహబూబ్‌నగర్ నుంచి తక్కువ మొత్తంలో పంట వస్తోంది. కానీ, ఇక్కడి నుంచి వచ్చిన పంటకు ధర ఎక్కువ పలకడంలేదు. క్వింటా గరిష్ట ధర 1500 కనిష్ట ధర 500 మాత్రమే పలికింది. మార్కెట్‌కు మిర్చిపంట రాక ప్రారంభమైంది. గద్వాల్, నాగర్ కర్నూల్, అచ్చంపేట ప్రాంతాల నుంచి వస్తోంది. సోమవారం 3,500 క్వింటాల్ల మిర్చి వచ్చింది. తేజ రకం క్వింటా గరిష్టంగా 1900, కనిష్టంగా 1400 పలికింది.